

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

కాకినాడ జిల్లా
కోనసీమ జిల్లా
తూర్పు గోదావరి జిల్లా
అల్లూరి సీతారామరాజు జిల్లా

మంగళవారం,5 ఆగస్టు 2025

8 పేజీలు


## అన్నదాత సుఖీభవ

# చెల్లింపులపై కలెక్టర్ సమీక్ష

**- కేటగిరీల వారీగా చెల్లింపులు కానీ వాటిపై సమగ్ర నివేదిక సిద్ధం చేయాలి - కలెక్టర్ పి.ప్రశాంతి**



**రాజమహేంద్రవరం, మేజర్‌న్యూస్ :** అన్నదాత సుఖీభవ – పీఎం కిసాన్ యోజన కింద జిల్లాలో తొలివిడతలో లబ్ధిదారులైన రైతుల ఖాతాల్లో నిధులు జమ కావడంపై, కొన్ని కేటగిరీల్లో నిధులు జమ కాకపోవడంతో వాటి గురించి సమగ్ర నివేదిక సమర్పించాలని జిల్లా కలెక్టర్ శ్రీమతి పి. ప్రశాంతి అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోజాయింట్‌కలెక్టర్ ఎస్. చిన్నరాముడు, వ్యవసాయ, రెవెన్యూ, సాంకేతికశాఖల అధికారులతో కలిసి నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ, కొంతమంది రైతుల ఖాతాల్లో నిధులు జమ కాకపోవడం నేపథ్యంలో ఫెయిల్డ్ కేటగిరీలను స్పష్టంగా గుర్తించాల్సిన అవసరం ఉందని తెలిపారు. గ్రామ పంచాయతీ, రైతు సేవా కేంద్రాల వారీగా పరస్పర పొంతన లేని వివరాలు గుర్తించి, వాటిపై ఆధారితంగా సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఫెయిల్డ్ కేటగిరీ క్రింద గుర్తించబడిన వాటిలోఆధార్ వివరాలు సరిపోలకపోవడం, బ్యాంకు ఖాతా అమాంతం లేకపోవడం, ఎన్‌పీసీఐ పేమెంట్ పెండింగ్ , మరణించిన లబ్ధిదారులు ,తాత్కాలిక భూయాజమాన్య ధృవీకరణ పత్రం, భూ వివాదాలు, సర్వే కాని భూములు,

- తరువాయి 2లో..

# పీ4లో అందరి భాగస్వామ్యం కావాలి

**- ఎమ్మెల్యే రాజప్ప పిలుపు**




**పెద్దాపురం రూరల్, మేజర్‌న్యూస్ :** పీ4 బంగారు కుటుంబాల కార్యక్రమంలో పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలు, ప్రైవేట్ సంస్థలు, ఉద్యోగులు భాగస్వామ్యం కావాలని, ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పిలుపునిచ్చారు. సోమవారం పెద్దాపురంపట్టణంలోనిమట్టే ఆది నారాయణ, శ్రీమతి నాగమణి ఆర్యవైశ్య సేవా సంఘం భవనం నందు ఆర్డీఓ కె.శ్రీరమణి అధ్యక్షతన పీ4బంగారు కుటుంబం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పాల్గొని మాట్లాడుతూ పీ4 కార్యక్రమాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారని, దీనిలో సామాజిక అవసరాలను గుర్తిస్తూ 2027 వికసిత్ భారత్‌లో భాగంగా రాష్ట్రంతో పాటు ప్రతీ నియోజకవర్గాన్ని అభివృద్ధపరచాలని, సిఎం చంద్రబాబునాయుడు ముఖ్య ఉద్దేశమని తెలిపారు. దానిలో భాగంగానే పెద్దాపురం నియోజకవర్గం

- తరువాయి 2లో..



## ప్రజల ఆశీర్వాదంతోనే

# సంక్షేమ పాలన సాధ్యం

**- సీఎం చంద్రబాబుతోనే స్వర్ణాంధ్ర సాకారం**

**- కాజులూరు మండలంలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో మంత్రి సుభాష్**

**కాజులూరు,మేజర్‌న్యూస్ :** ప్రజల ఆశీర్వాద బలంతోనే కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడాది కాలంలోనే రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రెట్టింపుస్థాయిలో సంక్షేమపాలన అందించారని ఇకమీదట కూడా రెట్టింపుగా సంక్షేమపాలన కొనసాగుతుందని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. సోమవారం రామచంద్రపురం నియోజవర్గంలోని కాజులూరు మండలంలోని అంద్రంగి గ్రామంలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో మంత్రి సుభాష్ తో పాటు కూటమి నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన ఇంటింటికి తిరిగి ప్రజా సమస్యలు తెలుసుకుంటూ, ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరిస్తూ ముందుకు సాగారు. ఆయా గ్రామాల్లో ఉన్న భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్బంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం ఉత్సాహంగా, ప్రజల ఆశీర్వాద బలంతో ముందుకు కొనసాగుతుందని తెలిపారు.ప్రజల ఆలోచనలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వ పాలన సాగుతుందన్నారు. వైకాపా గత ఐదేళ్ల దందాలు, అరాచకాలు, మోసాలు, ఆక్రమణలతో

- తరువాయి 2లో..

# ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోండి

**- కబ్జాదారులపై క్రిమినల్ చర్యలు చేపట్టండి**

**- జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేసిన ఎమ్మెల్యే వనమాడి**







**కాకినాడ,మేజర్‌న్యూస్ :** కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా పరిధిలోని చీడీలపోర మరియు పోర్టు పరిసర ప్రాంతాల్లో కోట్లు విలువ చేసే కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన భూములను, గత ప్రభుత్వపు రాజకీయ నాయకుల కనుసన్నల్లో తప్పుడు పత్రాలను సృష్టించి రెవెన్యూ మరియు రిజిస్టర్ కార్యాలయాల నందు తప్పుడు సర్వే నెంబర్లతో భూములను రిజిస్ట్రేషన్లు చేయించినవారిపై చర్యలు చేపట్టాలని కోరుతూశాసనసభ్యులు వనమాడి కొండబాబు సోమవారం జిల్లా కలెక్టర్‌కి వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా కొండబాబు మాట్లాడుతూ కాకినాడ మున్సిపల్

- తరువాయి 2లో..

## ఆర్జీల పరిష్కారంలో నాణ్యతతో పాటుగా

# నిర్దిష్టమైన స్పష్టత ఉండాలి..

**- జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్**




**అమలాపురం,మేజర్‌న్యూస్ :** ఆర్జీల పరిష్కారంలో నూటికి నూరు శాతం నాణ్యతతో పాటుగా నిర్దిష్టమైన స్పష్టత ఉండాలని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ జిల్లా స్థాయి అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసల్ సిస్టమ్–పీజీఆర్ఎస్) కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టరేట్ గోదావరి పవన్ నందు జిల్లా కలెక్టర్ డా.మహేష్ కుమార్, జాయింట్ కలెక్టర్ నిషాంతి అర్జీదారుల నుంచి సుమారుగా 250 అర్జీలు స్వీకరించారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కర వేదిక కార్యక్రమం ద్వారా అందే ఆర్జీలను పారదర్శకంగా, జవాబుదారితనంతో నిర్దిష్టమైన స్పష్టతతో అర్జీదారుడు సంతృప్తి చెందేలాపరిష్కరించాలనిఅధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆర్జీదారుల నుండి స్వీకరించిన సమస్యలకు సంబంధించి అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి శాశ్వత పరిష్కారం చూపే విధంగా చర్యలు

- తరువాయి 2లో..

# పెరవలి మండలం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కడింపాడులో ఉచిత కంటి వైద్య, దంత వైద్య శిబిరం




– ప్రారంభించిన రవళి స్పిన్నర్స్ జెఎండి వంక రాజకుమారి

**పెరవలి, మేజర్ న్యూస్ :** కడింపాడు గ్రామంలో శెట్టిబలిజ రామాలయం వద్ద గల కమ్యూనిటీ హాలులో ఆగస్టు 4వ తేదీ సోమవారం పెరవలి మండలం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విష్ణు దంత వైద్య కళాశాల భీమవరం వారి సహకారంతో ఉచిత దంత వైద్య శిబిరం పాలకొల్లు రాజవల్లి రాధారమణ లయన్స్ కంటి ఆసుపత్రి వారి సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ ఉచిత దంత వైద్య కంటి వైద్య శిబిరాలను రవళి స్పిన్నర్స్ జేఎండి తణుకు మాజీ మున్సిపల్ చైర్పర్సన్ వంక రాజకుమారి ప్రారంభించారు. ఈ సందర్భంగా వంక రాజకుమారి మాట్లాడుతూ పెరవలి మండలం లయన్స్ క్లబ్ ఏర్పాటు చేసే ఉచితంగా వైద్య శిబిరాలకు భీమవరం విష్ణు దంత వైద్య కళాశాల వారి సహకారం మరువలేనిది అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సేవలు అందిస్తున్న పెరవలి మండలం లైన్స్ క్లబ్ కు విష్ణు దంత వైద్య కళాశాల వారు అందించే సహకారంతో పెరవలి మండలంలోని 18 గ్రామాలకు చెందిన దిగువ మధ్య తరగతి ప్రజలకు చక్కటి సేవలు లభిస్తున్నాయని అన్నారు. అదేవిధంగా పాలకొల్లు లైన్స్ కంటే ఆసుపత్రి వారి సహకారంతో పెరవలి మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లో చక్కటి కంటి వైద్య సదుపాయాలు కల్పిస్తున్నారని అందుకు లైన్స్ కంటి ఆసుపత్రి యాజమాన్యానికి ధన్యవాదాలు అన్నారు. ఈ కార్యక్రమానికి స్పాన్సర్ గా వ్యవహరించిన సోలార్ కంపెనీ శ్రీ స్పార్క్ ఇన్ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ వారికి పెరవలి మండలం లయన్స్ క్లబ్ సభ్యులు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పెరవలి మండలం లైన్స్ క్లబ్ అధ్యక్షుడు దేవరపు వెంకట్రాయుడు,సెక్రెటరీ సలాది ఉదయ భాస్కరరావు, ట్రజరర్ బూరుగుపల్లి రాజు, పెరవలి మండలం లైన్స్ క్లబ్ నెంబర్లు కోటిపల్లి మురళీకృష్ణ, కార్చెర్ల సీతారాం ప్రసాద్, దేవరపు ఏడుకొండలు, చంటిరాజు తోపాటు పెరవలి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

## ఆర్జీల పరిష్కారంలో నాణ్యతతో పాటుగా నిర్దిష్టమైన స్పష్టత ఉండాలి..

మొదటిపేజి తరువాయి

తీసుకోవాలన్నారు.ప్రజలు ఎదుర్కొం టున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువస్తే సమస్య పరిష్కారమవుతుందనే ఆశతో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను ఆశ్రయిస్తార న్నారు. ఆర్జీదారుడు పనితీరుపై పెట్టుకున్న నమ్మకానికి అనుగుణంగా అధికారులు సమస్యలను పరిష్కరిం చేందుకు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. ఆర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్దేశించిన సమయంలో పరిష్కరించాలని,ఈవిషయంలో ఎటువంటి అలసత్వం ప్రదర్శించిన ఉపేక్షించబోనని జిల్లా కలెక్టర్ అధికారులకు స్పష్టం చేశారు.

పరిష్కార వేదికలో నమోదు అయ్యే ఆర్జీల పరిష్కారంపై రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్ర బాబునాయుడు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని, ఈ నేపథ్యంలో క్షేత్రస్థాయిలో అధికారులు సమస్యలను పరిశీలించి నిర్ణీత కాలపరిమితిలోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఇన్చార్జి డిఆర్ఓ మరియు ఆర్డీవో కే.మాధవి, జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు మధుసూదన్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పి.కృష్ణమూర్తి, జిఎస్‌డబ్ల్యూఎస్ కోఆర్డినేటర్ రాజేశ్వరరావు, జిల్లాస్థాయి అధికారులు, వికాస జిల్లా మేనేజర్ జి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల ఆశీర్వాదంతోనే సంక్షేమ పాలన సాధ్యం

మొదటిపేజి తరువాయి

ప్రభుత్వ సమయాన్ని వృథా చేసింది చాలక, కూటమి ప్రభుత్వంలో జరుగుతున్న అభివృద్ధిని, సంక్షేమాన్ని చూసి ఓర్వలేక ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. జగన్ రెడ్డి ఎన్ని రకాలుగా ప్రయత్నాలు చేసినా వారి ప్రయత్నాలు పలించవన్నారు. కూటమిని ఆదరించినందుకు ఏడాది పాలనలోనే ప్రజలకు మంచి చేశామన్నారు.

రాష్ట్రంలో కూటమి పాలనలో, చంద్రబాబు నాయకత్వంలో ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ అక్కల రిష్వంత్ రాయ్, నియోజకవర్గ పరిశీలకులు కాకినాడ రామారావు, మండల అధ్యక్ష, కార్యదర్శులు పలువురు కూటమి పార్టీ నాయకులు, ఆయా గ్రామాల అధ్యక్ష,కార్యదర్శులు, బూత్ క్లస్టర్ ఇంచార్జిలు, డీసీలు, అనుబంధ సంస్థల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా సిపిఎం నిరసన

– పాడా పీడికి వినతి పత్రం అందించిన డి.శేషుబాబ్జి




**పిఠాపురం, మేజర్ న్యూస్ :** స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా సిపిఎం మండల కన్వీనింగ్ కమిటీ ఆధ్వర్యంలో... జిల్లా నాయకులు డి. శేషు బాబ్జి స్థానిక పాడా కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. పాడా పీ డీ ఎన్ వి వి సత్యనారాయణకు వినతిపత్రం అందించారు. డి. శేషాబాబ్జి మాట్లాడుతూ... ఎన్నికల ముందు ఎవరైనా మీ ఇంటికి స్మార్ట్ మీటర్లు బిగించడానికి వస్తే పగలగొట్టండని నారా లోకేష్ చెప్పడం జరిగిందని, కానీ నేడు అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో రెండు కోట్లు పైబడి స్మార్ట్ మీటర్లు అమర్చాలని ఈపీడీసీఎల్ కు ఆదేశాలు ఇచ్చిందన్నారు. విద్యుత్తు వినియోగదారులు అనుమతి లేకుండా బిగించి వెళ్ళుతున్నారన్నారు. ఒక మీటరు ఖరీదు సింగిల్ ఫేజ్ కి రూ. 8 వేలు, 3 ఫేజ్ కు రూ. 17 వేలు ఖర్చును 92 నెలల వ్యవధిలో అదాని గ్రూపుకి ప్రభుత్వాలు చెల్లించిన వలసిన పరిస్థితి ఉందని, ఆ భారాన్ని కూడా వినియోగదారులపై బిల్లులో భవిష్యత్‌లో మోపుతారన్నారు. కరెంటు కావలిస్తే రీఛార్జి చేయించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని, రీఛార్జ్ చేయించుకోని ఎడల కరెంటు నిలిచిపోయే ప్రమాదం ఉంటుందని, ఇప్పటికే గతంలో 2024–25వ సంవత్సరంలో వాడిన విద్యుత్తుకు రూ.15,500 కోట్ల రూపాయలు ప్రజలపై ఫిక్స్డ్, కస్టమర్, ఈడి, సర్ చార్జీ లు పేరుతో అదనపు భారం మోపి వసూలు చేయడం జరుగుతోందన్నారు. పనిచేస్తున్న మీటర్లను తీసివేసి అధానీ సంస్థకు లాభాలు చేకూర్చే విధంగా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల నిర్ణయాన్ని సిపిఎం గా వ్యతిరేకిస్తున్నామని ప్రజలందరూ కూడా వ్యతిరేకించాలన్నారు.స్మార్ట్ మీటర్లు, ట్రూ అప్ చార్జీలు రద్దు చేయాలని, ప్రజల పై విద్యుత్ భారాలు మోపరాదన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కోనేటి రాజు, కె. నాగేశ్వరరావు, కరణం విశ్వనాథం, జి. వీరబాబు, వి ఎస్ రెడ్డి, గోపాలకృష్ణ, శ్రీను, రాజు, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

## అన్నదాత సుఖీభవ చెల్లింపులపై కలెక్టర్ సమీక్ష

మొదటిపేజి తరువాయి

జాయింట్ ఎల్పీఎంలావాదేవీలు వంటివి కారణాలు గుర్తించినట్లు తెలిపారు. ఈలోపాలను తహసీల్దార్ స్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని, అందులో నిర్లక్ష్యానికి ఆస్కారం ఉండకూడదని కలెక్టర్ స్పష్టంచేశారు.మరణించిన లబ్ధిదారుల వారసులు మ్యుటేషన్ కోసం దరఖాస్తు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా స్థాయిలో అన్ని మండలాలలో రెవెన్యూ మరియు వ్యవసాయ శాఖల సమన్వయంతో రికార్డు పరిశుద్ధి త్వరితగతిన పూర్తి చేయాలని చెప్పారు.తొలివిడతలో వివిధ కారణాలవల్లనిధులు పొందలేని అర్హులైన రైతులకు, రెండో విడత నిధులు విడుదల సమయంలో రెండో విడతతో పాటు మొదటి విడత చెల్లింపులుకూడా కలిపి జమ చేయనున్నట్లు కలెక్టర్ వివరించారు పంచాయతీ, ఆర్ఎస్‌కె వారిగా కూడిన నివేదిక సిద్ధం చేయాలని ఆమె ఆదేశించారు. ఈసమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్. చిన్న రాముడు, జిల్లా వ్యవసాయ అధికారి ఎస్. మాధవరావు, ఈడీఎంసీ సతీష్, పెరవలి, రాజమండ్రి రూరల్, గోకవరం,రాజానగరం తహసీల్దార్లు, మండల వ్యవసాయ అధికారులు, రైతు సేవా కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

## పీ4లో అందరి భాగస్వామ్యం కావాలి

మొదటిపేజి తరువాయి

విజన్2047ప్లాన్ తయారు చేయడం జరిగిందని, పారిశ్రామిక వేత్తలు, వ్యాపారవేత్తలు, ప్రైవేట్ సంస్థలు, ఉద్యోగులు, ముందుకు వచ్చి బంగారు కుటుంబాలు దత్తత తీసుకోవాలని ఆయన తెలిపారు. ఆర్డీఓ శ్రీరమణి తెలుపుతూ పెద్దాపురం నియోజకవర్గంలో మొదటి విడతలో 2500 కుటుంబాలను దత్తత తీసుకోవడం జరుగుతుందని, దానికిఅనుగుణంగాచర్యలు తీసుకుంటు న్నామని, దీనికి అందరి సహకారం కావాలని ఆమె తెలిపారు. పెద్దాపురం మున్సిపల్ మాజీ చైర్మన్ రాజాసూరిబాబురాజు,టిడిపి,పెద్దాపురం సామర్లకోట పట్టణాధ్యక్షులు రంధి సత్యనారాయణ, అడబాల కుమారస్వామి, పెద్దాపురం మండల టిడిపి అధ్యక్షులు మొయిళ్ళ కృష్ణమూర్తి, జనసేన పెద్దాపురం పట్టణాధ్యక్షులు పొలమరశెట్టి సత్తిబాబు, అత్తెం వీరభద్రరావు, పచ్చిపాల సతీష్, కొల్లి రాజు, పలువురు కూటమి నాయకులు, తహశీల్దార్లు సిహెచ్.వెంకటలక్ష్మీ, చంద్రశేఖరరెడ్డి, ఎంపిడిఓలు డి.శ్రీలలిత, కె.హిమ మహేశ్వరి, పెద్దాపురం మున్సిపల్ మేనేజర్ యు.జ్యోతిరాణి, పలువురు అధికారులు, సిబ్బంది, టిడిపి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోండి

మొదటిపేజి తరువాయి

కార్పొరేషన్ పరిధిలో చీడీలపొర మరియు పోర్టు పరిసర ప్రాంతాల్లో కోట్లు విలువ చేసే కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన భూములను, గత ప్రభుత్వపు రాజకీయ నాయకుల కనుసన్నల్లో తప్పుడు పత్రాలను సృష్టించి రెవెన్యూ మరియు రిజిస్టర్ కార్యాలయాల నందు తప్పుడు సర్వే నెంబర్లతో భూములను రిజిస్ట్రేషన్లు చేయించారని, మరల అవే దస్తా వేజులను దర్జాగా బయటకి తిప్పుతూ అమాయక ప్రజలకు అంటకట్టడానికి ప్రయత్నాలు చేస్తున్నారని, చీడీలపొరలో గల సర్వే నెంబరు.112,182, 199/6/1లో సుమారు యాభై ఎకరాల భూమిని, కాకినాడ ఆర్డిఓ కేసిన అమ్మిరాజు, గంటి గన్నయ్య, ఎం సత్యనారాయణ మరియు పోలిశెట్టి వెంకట రమణ గార్లకు నిరభ్యంతర పత్రము ఇచ్చినట్లుగా తప్పుడు దస్తావేజులు సృష్టించి,చీడిలపొరలోని ప్రభుత్వానికి చెందిన పోరంబోకు, జిరాయితి భూములను చూపించి, బయటి వ్యక్తులకు అమ్ముతున్నారని,కాకినాడ పోర్టుకి సంబంధించిన ఆర్.ఎస్.నెం. 364/2, ఆర్.ఎస్.నెం.2004 సుమారు 79 ఎకరాల భూమికి రెండు పార్టీలకు చెందినదిగా అందులో ఒకరు బెంగుళూర్ కు చెందిన వ్యక్తిదిగా దస్తావేజు సృష్టించారని, అలాగే కాకినాడ సాంబమూర్తి నగర్ నందు గల కేంద్ర ప్రభుత్వానికి చెందిన భూములను చదును చేసి ప్రైవేటు జరాయితీ భూములుగా సర్వే నెంబర్లు మార్పించి లే-అవుట్లు చేశారని, గత ప్రభుత్వ హయాంలో పనిచేసిన కొంతమంది అధికారుల అండదండలతో తప్పుడు సర్వే నెంబర్లతో పత్రాలను తారుమారు చేసి వేరు వేరు చోట్ల రిజిస్టర్ ఆఫీసు ల నందు తప్పుడు రిజిస్ట్రీ చేయించడమే కాకుండా వాటిని తొందరగా సామాన్య వ్యక్తులకు అమ్ముటకు ఒక ముఠా ప్రయత్నిస్తుందని, తప్పుడు సర్వే నెంబర్లతో భూములను రిజిస్ట్రేషన్లు చేయించిన వారిపై విచారణ జరిపించి కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వ భూములను తగిన చర్యలు తీసుకొని వారు సృష్టించిన తప్పుడు దస్తావేజులను వెంటనే రద్దు చేయాలని జిల్లా కలెక్టర్ గారిని కోరడం జరిగిందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షులు మల్లిపూడి వీరు, వి.వై.ఏసుదాసు, తుమ్మల రమేష్, బచ్చు శేఖర్, కొల్లా బత్తుల అప్పారావు, పలివెల రవి అనంత కుమార్, ఒమ్మి బాలాజీ, గదుల సాయిబాబా, చింతలపూడి రవి, పంతాడి రాజు, చింతా పేరాజు తదితరులు పాల్గొన్నారు.

# ఫోస్టర్ కేర్ (తాత్కాలిక సంరక్షణ) "కలిసొచ్చే కాలానికి నడిచొచ్చే పిల్లలు"

**– గోడపత్రిక ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్**



**కాకినాడ, మేజర్ న్యూస్ :** భారత ప్రభుత్వం ప్రతిపాదించిన ఫోస్టర్ కేర్ మోడల్ గైడెన్స్ అనుసరించి సోమవారం జిల్లా కలెక్టర్ మరియు జిల్లా మేజిస్ట్రేట్ షాన్ మోహన్ సగిలి చేతులమీదుగా ఫోస్టర్ కేర్ (తాత్కాలిక సంరక్షణ) పై ముద్రించిన గోడ పత్రికను విడుదల చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో పిల్లలు లేని తల్లిదండ్రులు కానీ, పిల్లలు ఉండి ఇంకనూ కొంతమందిని పెంచగలము అనుకునేవారు ఈ ఫోస్టర్ కేర్ ద్వారా 2 సంవత్సరాలు కాలపరిమితితో తాత్కాలిక దత్తత పొందవచ్చు అని, 2 సంవత్సరాలు పూర్తి అయిన తరువాత ఇద్దరికీ సమ్మతం అయితే తాత్కాలిక దత్తత ను కొనసాగించవచ్చు అని తెలియజేస్తూ ఎవరు అయినా సరే క్రింద పేర్కొన్న నియమ నిభందనలు అనుసరించి ఫోస్టర్ కేర్ కొరకు ఆన్లైన్ ఔఔఔ.జూా~ూా.చీ×జ.×చీ నందు ధరఖాస్తు చేసుకోవచ్చు అని తెలియజేయడం అయినది.

ఫోస్టర్ కేర్ అనేది 6 సంవత్సరాల పైబడి 18 సంవత్సరాల లోపు పిల్లలను రెండు సంవత్సరాల పాటు పెంచి తదుపరి శాశ్వతంగా దత్తత పొందే అవకాశం ఫోస్టర్ కేర్ ద్వారా కలుగుతుంది. ఫోస్టర్ కేర్ అనేది తల్లిదండ్రుల సంరక్షణ లేని పిల్లలకు తాత్కాలిక సంరక్షణ అందించే వ్యవస్థ. ఈ పిల్లలు వివిధ కారణాల వల్ల తమ కుటుంబాలలో ఉండలేనప్పుడు ఫోస్టర్ కేర్ తల్లిదండ్రులు, వారికి ప్రేమను ఆప్యాయతను భద్రతా మరియు స్థిరత్వం అందిస్తారు. పిల్లలకు సురక్షితమైన మరియు ప్రేమతో కూడిన వాతావరణం అందిస్తూ మరియు వారి విద్య, ఆరోగ్యం మరియు భావోద్వేగ అవసరాలను తీరుస్తూ, పిల్లలకు స్థిరమైన జీవనాన్ని మరియు ఉజ్వల భవిష్యత్తును అందించడమే ఫోస్టర్ కేర్ యొక్క ప్రాముఖ్యత. సంరక్షణ మరియు రక్షణ అవసరమైన పిల్లలు, సాధారణంగా ఆరు సంవత్సరాల కంటే ఎక్కువ వయసు వుండి కమ్యూనిటీలో నివసిస్తున్నవారు మరియు చైల్డ్ కేర్ ఇన్స్టిట్యూట్ లో తల్లిదండ్రుల సందర్శనలు లేని పిల్లలు లేదా అనర్హులైన సంరక్షణ ఉన్న పిల్లలు ఇందుకు అర్హులు. శారీరకంగా, మానసికంగా, భావోద్వేగ పరంగా మరియు ఆర్థికంగా సామర్థ్యం ఉన్న ఏ భారతీయ పౌరుడైన అవివాహితుడైన, వివాహితుడైన, వితంతువైన లేదా విడాకులు తీసుకున్న ఫోస్టర్ కేర్ తల్లిదండ్రులుగా ఉండటానికి దరఖాస్తు చేసుకోవచ్చును. ఆర్థికంగా యోగ్యత కలిగి ఉండాలి, భార్యాభర్తలిద్దరూ భారతీయ పౌరులుగా ఉండాలి. రెండు సంవత్సరాల స్థిరమైన వైవాహిక బంధాన్ని కలిగి ఉండాలి. వారికి ఎటువంటి ప్రాణాంతకరమైన వ్యాధులు గురికానటువంటి వారు, ఏదైనా నేరపూరిత చర్యలో దోషిగా నిర్ధారించబడినవారు అయ్యి ఉండకూడదు. పిల్లల హక్కులు ఉల్లంఘన కేసులో ప్రమేయం లేదా ఆరోపణలు ఎదుర్కొని ఉండకూడదు. ఫోస్టర్ కేర్ కోసం ప్రస్తుతం ఎటువంటి రుసుము చెల్లించనవసరం లేదు. ఫోస్టర్ కేర్ తీసుకున్న కుటుంబానికి బాలబాలికల విద్య, ఆరోగ్య అవసరాల నిమిత్తం స్పాన్సర్‌షిప్ పథకం కింద నెలకు 4 వేల చొప్పున రెండు సంవత్సరాల పాటు ఆర్థిక సహాయం అందించబడుతుంది. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు డైరెక్టర్, జిల్లా స్త్రీ మరియు శిశు అభివృద్ధి సమస్త, కాకినాడ జిల్లా సి.హెచ్. లక్ష్మీ, జిల్లా స్కీమ్స్ కోఆర్డినేటర్ ఎం.మాధవి, జిల్లా బాలల పరిరక్షణ అధికారి సిహెచ్.వెంకటరావు, పివో-ఐసి శ్రీనివాసరావు, పివో-ఎన్ఐసి జె.విజయ, జిల్లా ఆఫీసర్లు మరియు సిబ్బంది పాల్గొనడం జరిగినది.

# జాబ్‌మేళా ప్లకార్డుల ఆవిష్కరణ

**కాకినాడ, మేజర్ న్యూస్ :** కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు (కొండబాబు) ఆధ్వర్యంలో "వికాస" సహకారంతో ఐడియల్ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ & సైన్స్, ఇంద్రపాలెం, కాకినాడలో ఈ నెల 07వ తేదీ గురువారం జరగనున్న "మెగా జాబ్‌మేళా" వివరాలు తెలుపు ప్లకార్డును కలెక్టర్ మరియు జిల్లా మెజిస్ట్రేట్ సగిలి షాన్మోహన్ సోమవారం స్పందనహాలులో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ జాబ్‌మేళాలో సాఫ్ట్‌వేర్, ఫార్మా, బ్యాంకింగ్, బి.పి.ఒ మరియు టెక్నికల్ రంగాలైన సుమారు 33 ప్రముఖ కంపెనీల్లో 1200 ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు జరుగనున్నాయని, నిరుద్యోగ యువతీ యువకులందరూ హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, ట్రైనీ కలెక్టర్ మనీషా, డి.ఆర్.ఒ. జె.వెంకటరావు, వికాస ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.లచ్చారావు తదితరులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ లక్ష్యం మేరకు సిబ్బంది పనిచేయాలి





**– జడ్పీ సీఈఓ వానపల్లి లక్ష్మణరావు**

**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** మండలంలో ప్రజల సమస్యలు పరిష్కరించి, అభివృద్ధి కార్యక్రమాలు బాగా అమలు జరగాలంటే విధినిర్వహణలో ప్రభుత్వ ఉద్యోగులు నిర్లక్ష్యం వహించకూడదని, సిబ్బంది ప్రభుత్వ లక్ష్యం మేరకు పనిచేసి మండల అభివృద్ధికి సహకరించాలని తూర్పుగోదావరి జిల్లా పరిషత్ ముఖ్య కార్య నిర్వహణ అధికారి వానపల్లి వి.వి.ఎస్. లక్ష్మణరావు అన్నారు. రంపచోడవరం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాలయం సిబ్బందితో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై సీఈవో లక్ష్మణరావు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో జరుగుతున్న బంగారు కుటుంబాలు (పి4) సమగ్ర సర్వే, ఆధార్ లేని పిల్లల నమోదు, స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణ ఆంధ్ర, త్రాగునీరు, పారిశుధ్యం, ప్లాస్టిక్ నిర్మూలన, గృహనిర్మాణం ప్రగతి, అంగన్వాడీ కేంద్రాలలో నిర్మాణంలో ఉన్న మరుగుదొడ్లు, గ్రామ సచివాలయం ద్వారా ప్రజలకు అందుతున్న సేవలపై సిబ్బందితో సమీక్షించి గడువులోపు లక్ష్యాలను పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామాలలో ప్రజలకు త్రాగునీటి ఇబ్బంది లేకుండా పంచాయతీ కార్యదర్శులు ప్రణాళికలు తయారు చేసుకోవాలని ఆదేశించారు. పాడైపోయిన చేతి పంపులు, త్రాగునీటి బోర్లను సత్వరమే బాగుచేయించాలని సూచించారు. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రతి మూడో శనివారం ప్రభుత్వ ఆదేశాలు మేరకు ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాల న్నారు. ఏజెన్సీ ప్రాంతంలో మలేరియా, డెంగీ నివారణకు సిబ్బంది కృషి చేయాలన్నారు. అక్రమ కట్టడాలు, అనుమతులు లేని టూరిస్ట్ రిసార్ట్స్ నిర్వాహకులపై నిబంధనలు ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈసందర్భంగా మండల పరిషత్ అభివృద్ధి అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాథ్ మండల ప్రగతిని జడ్పీ సీఈఓకి వివరించారు. అనంతరం అధికారులు, ప్రజా ప్రతినిధులు జడ్పీ సీఈఓ లక్ష్మణరావుని సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బంధం శ్రీదేవి, జడ్పీటీసీ పండా వెంకట లక్ష్మీ, గంగవరం జడ్పీటీసీ గొల్లపూడి బేబీ రత్నం, డివిజనల్ డెవలప్మెంట్ అధికారి కోటేశ్వరరావు, పరిపాలన అధికారి జయంతి, డిప్యూటీ ఎంపీడీఓ రాజు, పంచాయతీ కార్యదర్శులు, పాల్గొన్నారు.

# నూతన జాతీయ విద్యా విధానం వల్ల పేదవారికి విద్య దూరం

**– ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బొర్రా గోపి మూర్తి**



**కాకినాడ, మేజర్ న్యూస్ :** భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ),కాకినాడ జిల్లా ప్లీనరీ సమావేశాలు స్థానిక కచ్చేరి పేట యూటిఎఫ్ హోమ్ నందు 2 రోజు జిల్లా అధ్యక్షుడు జి.శ్రీకాంత్ అధ్యక్షత నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన ఎమ్ ఎల్ సి బొర్రా గోపి మూర్తి మాట్లాడుతూ దేశంలో నూతన జాతీయ విద్యా విధానం వచ్చిన తర్వాత విద్య పేదవారికి అందరిదాక్కగా తయారైందని విమర్శించారు. దేశంలో ఎక్కడా నూతన జాతీయ విద్యా విధానం అమలు చేయకపోయినా మన రాష్ట్రంలో నూతన జాతీయ విద్యా విధానంలో అమలు చేస్తూ ప్రభుత్వ బడులను మూసివేస్తున్నారని విమర్శించారు. విద్య రంగంలో నూతన జాతీయ విధానం, మూడు సి లు విధానం అమలవుతుందని అన్నారు. ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించడం కోసం దేశంలో ఎస్ఎఫ్ఐ ఒకటే సమరశీల పోరాటం నిర్వహిస్తుందని అన్నారు. ప్రభుత్వ విద్యా రంగం కోసం ఎస్ఎఫ్ఐ కృషి అభినందనీయం అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పేదరికం తగ్గిస్తామని చెప్పి పి ఫోర్ విధానాన్ని ప్రవేశపెట్టి మొత్తం వ్యవస్థలను ప్రైవేటుపరం చేయడం కోసం చూస్తుందని, అందులో భాగంగానే విద్యను కూడా ప్రైవేట్ పరం చేయడం కోసం ఆలోచన చేస్తుందని విమర్శించారు.

**ఎస్ఎఫ్ఐ కాకినాడ జిల్లా కమిటీలో పలువురు చేరిక..** భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ జిల్లా ప్లీనరీ సమావేశాలు కాకినాడలో 2 రోజులపాటు నిర్వహించడం జరిగింది. ఈ సమావేశాలు 2వ రోజు యుటిఎఫ్ హోమ్ నందు రెండవరోజు జరిగిన సమావేశంలో నూతన జిల్లా కమిటీ లోకి జిల్లా సహాయ కార్యదర్శులుగా లోవరాజు (పిఠాపురం), అమృత (కాకినాడ), మణికంఠ (ప్రత్తిపాడు), జిల్లా కమిటీ సభ్యులుగా ఉదయ్ కుమార్ (తుని), రవి (సామర్లకోట ) అవకాశం లభించింది అని జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జి.శ్రీకాంత్, ఎమ్.గంగాసూరిబాబు తెలియజేశారు.

## 22ఎ జాబితా నుంచి తొలగించాలని కలెక్టర్‌కి వినతి



కాకినాడ, ఆగస్ట్ 4: కాకినాడ అర్బన్ పరిధిలోని పలు నివాస ప్రాంతాలను, గృహాలను నిషేధిత 22ఎ జాబితాలో ప్రభుత్వం ఉంచిందని దాన్ని తొలగించి తిరిగి రెవెన్యూ రికార్డుల్లో యధావిధిగా ఉంచాలని పలువురు సోమవారం కాకినాడలోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే పిజిఆర్ఎస్ కార్యక్రమంలో వినతిపత్రాన్ని అందించారు. కాకినాడ గైగలపాడు ఉషోదయ మార్టు వద్ద ఉన్న 1.60 ఎకరాలు, విద్యుత్ నగర్ వినాయకుడి ఎదురుగా ఉన్న 2.72 ఎకరాలు, వత్సవాయి సుబ్బరాజు కాలనీలో ఉన్న 27 ప్లాట్లను, ఎస్వీ రంగారావు విగ్రహం దగ్గర ఉన్న 550 చదరపు గజాలను సుమారు 20, 30, 40 ఏళ్ల నుంచి క్రితం కొనుగోలు చేశామని ఆ యజమానులు కలెక్టర్ షాన్ మోహన్ సగిలికి తెలిపారు. అనంతరం వారు దీనికి సంబంధించిన విషయాలను విలేకరులకు తెలియజేశారు. తాము సుమారు 40 ఏళ్ల క్రితం ఈ ప్రాంతాలలో స్థలాలను, ప్లాట్లను కొనుగోలు చేశామన్నారు. అప్పటినుంచి తాము ఆయా నివాసాలలో ఉన్నామని ప్రస్తుతం అవసరాలైన అనారోగ్య, పిల్లల వివాహ, ఇతర అవసరాల ఖర్చులకు వాటిని విక్రయించుకుందామనుకుంటే ప్రభుత్వం నిషేధిత జాబితాలో చేర్చిందని అందువల్ల వాటిని విక్రయించుకోలేకపోతున్నామన్నారు. తక్షణమే ఆ జాబితా నుండి తొలగించి న్యాయం చేయాలని యజమానులు పి.నాగమణి, వీ.నరసింహారాజు, ఎస్.ఎస్.ఎస్. నాయుడు, ఇ.వి.ఎస్. చౌదరి, కే. గణేష్ రావు, వి.నాగేంద్రరావు, షేక్ వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

# కాకినాడలో కదంతొక్కిన జర్నలిస్టులు






**- ఫెడరేషన్ ఆధ్వర్యంలో డిమాండ్స్ డే**
**- కలెక్టరేట్ ఎదుట రాస్తారోకో, నిరసన**
**- జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని నినాదాలు**
**- కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత**

**కాకినాడ,మేజర్‌న్యూస్ :** జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కాకినాడలో జర్నలిస్టులు కదం తొక్కారు. ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (ఏపీడబ్ల్యూజేఎఫ్) పిలుపు మేరకు సోమవారం డిమాండ్స్ డే నిర్వహించారు. జిల్లా నలుమూలల నుండి జర్నలిస్టులు కలెక్టరేట్ కు చేరుకొని అక్కడ నిరసన వ్యక్తం చేసి రాస్తారోకో చేపట్టారు. రాస్తారోకో సమయంలో ట్రాఫిక్ ఎక్కువగా చేరుకోవడంతో అక్కడ ఉన్న పోలీసులు జర్నలిస్టులను సమన్వయం చేస్తూ ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా నిరసన తెలియజేయాలని తెలపడంతో నిరసన ధర్నా కార్యక్రమం నిర్వహించారు. అనంతపురం కలెక్టర్ షన్మోహన్‌కు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు వాతాడ నవీన్ రాజ్, కార్యదర్శి ముమ్మిడి లక్ష్మణ్ మాట్లాడుతూ జర్నలిస్టుల పట్ల ప్రభుత్వాల వైఖరి మారాలని కోరారు. జర్నలిస్టులకు ఇళ్ళ స్థలాలు ఇస్తామని జీఓలు విడుదల చేస్తూ దానిని అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నాయని విమర్శించారు. చివరికి అక్రిడిటేషన్లు ప్రతీ ఏడాది ఇవ్వకుండా తాత్సారం చేస్తున్నారన్నారు. అనేక రాష్ట్రాలలో సీనియర్ జర్నలిస్టులకు ఫెన్షన్ సదుపాయం ఇస్తున్నందున ఇక్కడ కూడా వెంటనే అమలు చేయాలని, ఇప్పటికైనా జిల్లాలోని జర్నలిస్టులు అందరికి ఇళ్ళ స్థలాలు ఇవ్వాలని, వెంటనే అక్రిడిటేషన్ల జీఓ జారీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ జిల్లా నాయకులు ఎండి అధికార్, జి.శోభన్ బాబు, డి శ్రీధర్, పుర్రే త్రినాధ్, వల్లూరి నానాజీ, బాబీ, సత్తిబాబు,వాసంశెట్టి శ్రీనివాస్, జగ్గంపేట నియోజకవర్గ అధ్యక్షులు వీరభద్రరావు, కార్యదర్శి పండు, పిఠాపురం నియోజకవర్గ అధ్యక్షులు సత్య, పెద్దాపురం నియోజకవర్గ అధ్యక్షులు రెడ్డి, తుని నియోజకవర్గ నాయకులు బి.ప్రవీణ్, పడాల ప్రసాద్, లోవరాజు, తాళ్ళరేవు నాయకులు మల్లేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

వైసిపి నాయకులు మద్దతు...ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (ఏపీడబ్ల్యూజేఎఫ్) చేపట్టిన డిమాండ్స్ డే కు వైసిపి జిల్లా నాయకులు మద్దతు ప్రకటించారు. మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి జర్నలిస్టుల ఇళ్ల స్థలాలు సంక్షేమంపై అంతా తయారు చేశారని, కానీ మరలా వైసిపి ప్రభుత్వం రాకపోవడంతో కనీసం తయారు చేసిన ఫైల్‌ను చూసేందుకు కూటమి ప్రభుత్వానికి సమయం లేకపోవడంతో జర్నలిస్టులకు అన్యాయం జరుగుతుందని, జర్నలిస్టుల న్యాయపరమైన డిమాండ్లు రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని జర్నలిస్టుల ఆందోళనకు వైసీపీ తరఫున మద్దతు ప్రకటిస్తున్నామని తెలిపారు. మద్దతు ప్రకటించినవారిలో వైసిపి కాకినాడ జిల్లా అధ్యక్షులు దాడిశెట్టి రాజా, మాజీ ఎంపీ వంగా గీతవిశ్వనాథ్, మాజీ మంత్రి తోట నరసింహం, మాజీ ఎమ్మెల్యేలు ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి, దవులూరి దొరబాబు కాకినాడ సిటీ వైసిపి నాయకులు ఉన్నారు.

# ర్యాలిలో రేషన్ బియ్యం సీజ్



**ఆత్రేయపురం,మేజర్‌న్యూస్ :** మండల పరిధిలోని ర్యాలి గ్రామంలో పోలీసులు జరిపిన దాడుల్లో 15 బస్తాలలో 340 కేజీల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నారు. ఆత్రేయపురం ఎస్ఐ ఎస్.రాముకి ర్యాలి గ్రామంలో కిరాణా షాపులో రేషన్ బియ్యాన్ని నిల్వ చేసి అమ్మకాలు చేస్తున్నారు అని వచ్చిన సమాచారంతో ర్యాలి గ్రామంలోని మద్దుల వెంకటేశ్వరావు కిరాణా షాప్ సోదాలు జరిపారు. షాపులో అక్రమంగా 15 బస్తాల్లో నిల్వ వుంచిన 340 కేజీల బియ్యం స్వాధీనం చేసుకుని షాప్ యజమాని వెంకటేశ్వరరావుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## వాట్సాప్ గవర్నెన్స్‌పై పూర్తిస్థాయిలో

# ఒక్కరికి అవగాహన పెంపొందించాలి

**- జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్**



**అమలాపురం, మేజర్ న్యూస్ :** మనమిత్ర క్యాంపెయిన్ కార్యక్రమం ప్రతినెల 5వ తేదీన నిర్వహిస్తూ క్షేత్రస్థాయిలో వాట్సాప్ గవర్నెన్స్‌పై పూర్తిస్థాయి అవగాహన ప్రజలలో కల్పించి కార్యాలయాలకు ప్రతి పనికి వెళ్లే అవసరం లేకుండా యాప్ వినియోగంపై ప్రతి ఒక్కరికి అవగాహన పెంపొందించాలని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ గ్రామ, వార్డు సచివాలయ అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక ప్రజా వేదిక కార్యక్రమంలో ఆయన ప్రసంగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా కార్యాలయాలకు ప్రజలు వెళ్లే పని లేకుండా ప్రతి పనిని మన మిత్ర యాప్ వాట్సప్ గవర్నెన్స్ ద్వారా ఇంటిలో నుండి ఫిర్యాదులను నమోదు చేసి వాటికి పరిష్కార మార్గాలు పొందవచ్చునన్నారు. మనమిత్ర క్యాంపెయిన్‌లో భాగంగా ప్రతి నెల 5వ తేదీ న ర్యాలీలు నిర్వహిస్తూ యాప్ వాట్సప్ గవర్నెన్స్ వినియోగంపై అవగాహన కల్పించాలని సూచించారు. వర్క్ ఫ్రం హోంకు సంబంధించి జిల్లా వ్యాప్తంగా రెండు నెలల క్రితం సర్వే నిర్వహించామని, అప్పట్లో వర్క్ ఫ్రం హోం కోరుకున్న యువతీ యువకుల నుంచి విద్యార్హతలు ధ్రువపత్రాలను సేకరించడం జరగలేదని, మరలా మనమిత్ర క్యాంపెయిన్‌లో గతంలో వర్క్ ఫ్రం హోం పట్ల ఆసక్తి కనపరిచిన 1,17,564 యువతీ యువకుల నుండి విద్యార్హతలు ధ్రువపత్రాలను ఇంటింటి పర్యటనలో సేకరించి యాప్‌లో అప్లోడ్ చేయాలన్నారు. ప్రతి నెల 5వ తేదీ నిర్వహించే ర్యాలీలు 5వ తేదీ సెలవు దినం అయితే తదుపరి ఆరో తేదీన ఈ యొక్క ర్యాలీలను తప్పనిసరిగా నిర్వహించి వాట్సప్ గవర్నెన్స్‌పై అవగాహన కల్పించాలని స్పష్టం చేశారు. ఇంజనీరింగ్ విభాగాల ద్వారా దాదాపుగా నిర్మాణాలు పూర్తి చేసి చిన్నపాటి కారణాలతో నిరుపయోగంగా ఉన్న భవనాల వివరాలను రెండు రోజులలో సమర్పించాలని జిల్లాకలెక్టర్ జిల్లాస్థాయి అధికారులు ఆదేశించారు.


# ఉసులుమర్రు అంగన్వాడి సెంటర్లో తల్లిపాల వారోత్సవాలు




**పెరవలి, మేజర్ న్యూస్ :** ఉసులుమర్రు గ్రామంలో కోడ్ నెంబరు 53 ,54, 55, అంగన్వాడీ కేంద్రాలలో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం ఇవాళ నాలుగో రోజు ఎంసిపి కార్డ్ గురించి కుటుంబసభ్యులకు తెలియచేయదానికి సంబంధించి ఆగస్టు 4వ తేదీ సోమవారం సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న వక్తలు తల్లిపాల ప్రాముఖ్యత పుట్టిన వెంటనే గంటలోపు తల్లిపాలు ఇవ్వడం గురించి తల్లిపాలల్లో ఉండేటువంటి పోషకాలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వీరమల్ల నాగలక్ష్మి , విలేజ్ సెక్రటరీ హర్ష, ఏఎన్ఎం భాగ్యలక్ష్మి, ఎమ్మెల్ హెచ్పి జ్యోతి అంగన్వాడి టీచర్స్ కృష్ణవేణి,టి సత్యవతి, డి సత్యవాణి ,ఆశ కార్యకర్తలు మరియు కూటమి నాయకులు, తల్లులు పాల్గొన్నారు.

# విద్యుత్ షాక్‌తో ప్రైవేట్ ఎలక్ట్రీషన్ మృతి

**- బాధిత కుటుంబాన్ని ఫోన్లో పరామర్శించి ఆదుకుంటామని హామీ ఇచ్చిన మంత్రి దుర్గేష్**
**- ఫోన్లో పరామర్శించిన స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ బూరుగుపల్లి శేషారావు**



**పెరవలి, మేజర్ న్యూస్ :** కానూరు అగ్రహారం గ్రామంలో ఆగస్టు 4వ తేదీ సోమవారం మధ్యాహ్నం 2.30 నిమిషాల సమయంలో కేబుల్ టీవీ వైరు కట్టడానికి విద్యుత్ స్థంభం ఎక్కిన గ్రామంలోని ప్రైవేట్ ఎలక్ట్రీషన్ పల్లా దానయ్య వయసు 42 సంవత్సరాల అనే వ్యక్తి విద్యుత్ స్తంభం మీద ఉం డగా విద్యుత్ షాక్‌కు గురై సంఘటనా స్థలంలోనే మరణించారు. వెనుకబడిన వర్గాలకు చెందిన పల్లా దానయ్య తండ్రి విశ్వేశ్వరరావు గతంలోనే మరణించారని కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉన్న పల్లయ్య మృతితో తమకు దిక్కు ఎవరని పల్లయ్య భార్య ధనలక్ష్మివిలపిస్తున్నారు. పల్లయ్యకు ఇద్దరు కుమారులు కలరని వారిరువురూ రామ సతీష్ (18) గోపి సంతోష్ (16) కూడా ఇంకా స్థిర పడలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయం తెలిసిన వెంటనే మంత్రి దుర్గేష్ బాధిత కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి తాను అండగా ఉంటానని హామీ ఇచ్చారు. అదేవిధంగా విద్యుత్ ఉన్నత అధికారులతో మాట్లాడి తక్షణమే బాధిత కుటుంబానికి న్యాయం చేయమని ఆదేశించారు. అదేవిధంగా ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ నిడదవోలు మాజీ శాసనసభ్యులు బూరుగుపల్లి శేషారావు తన కార్యకర్తల ద్వారా ఈ విషయాన్ని తెలుసుకుని బాధింత కుటుంబాన్ని ఫోన్లో పరామర్శించారు.

# ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 8 అర్జీలు




**పెద్దాపురం, మేజర్ న్యూస్ :** సోమవారం పెద్దాపురం ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమానికి 8 అర్జీలు వచ్చినట్లు ఆర్డీఓ కె.శ్రీరమణి తెలిపారు.ఈఅర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని ఆర్డీఓ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ కార్యాలయ ఏఓ మాధవరావు, డివిఎల్‌పిఓ కార్యాలయ ఏఓ మైధిలి, హౌసింగ్ ఏఇ రవిశంకర్, డివిజన్‌లోని వివిధ శాఖల డివిజన్ స్థాయి అధికారులు, అర్జీదారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆగస్టు 12న జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం

**– 1-19 ఏళ్ల పిల్లలకు ఉచిత ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ**
**– పిల్లలు, కిశోర బాలలలో నులి పురుగుల నిర్మూలనే లక్ష్యం**
**– జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి**




**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** పిల్లలు మరియు కిశోర బాలలలో నులి పురుగుల నిర్మూలనే లక్ష్యంగా ఈ నెల 12న జిల్లావ్యాప్తంగా జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి తెలిపారు. సోమవారం ఉదయం బొమ్మూరు కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ సమావేశ మందిరంలో ఆల్బెండజోల్ ప్రచార గోడపత్రికను జాయింట్ కలెక్టర్ ఎస్ చిన్న రాముడుతో కలిసి ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి మాట్లాడుతూ, నులి పురుగులు సోకిన పిల్లల్లో రక్తహీనత, పోషకాహార లోపం, ఆకలి తగ్గడం, నిదానమైన శారీరక వృద్ధి, కడుపునొప్పి, వికారం, వాంతులు, విరోచనాలు, బరువు తగ్గడం వంటి అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని పేర్కొన్నారు. ఈ సమస్యల నివారణకు ప్రతి సంవత్సరం రెండు దఫాలుగా దేశవ్యాప్తంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సంవత్సరం ఆగస్టు 12న జిల్లా వ్యాప్తంగా మొదటి విడతగా ఈ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు. 1-5 ఏళ్ల పిల్లలకు అంగన్వాడీ కేంద్రాల్లో, 6-19 ఏళ్ల పిల్లలకు పాఠశాలలు, కళాశాలలలో ఉచితంగా ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చెయ్యడం జరుగుతుందని వెల్లడించారు. పాఠశాలకు వెళ్లని లేదా ఇతర పిల్లలకు కూడా అంగన్వాడీ కేంద్రాల ద్వారామాత్రలు అందుబాటులో ఉంచనున్నట్లు పేర్కొన్నారు. మాత్రల మోతాదులు: 1-5 ఏళ్ల పిల్లలకు – 200 మి.గ్రా. , 6-19 ఏళ్ల వయస్సు గల పిల్లలకు – 400 మి.గ్రా. ఈ మాత్రలను ఆహారం తీసుకున్న 30నిమిషాల తర్వాత ఇవ్వాలని సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను స్థానిక అంగన్వాడీ, పాఠశాల, కళాశాలకు తీసుకెళ్లి డివార్మింగ్ మాత్రలు మింగేలా చూడాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఆగస్టు 12న డివార్మింగ్ చేయబడని పిల్లలకు –ఆగస్టు 20న "మాప్-అప్ డే" రోజున ఆల్బెండజోల్ మాత్రలు ఇవ్వనున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్. చిన్న రాముడు, డిఆర్ఓ టి.సీతారామ మూర్తి, డిఎంహెచ్ఓ కె వెంకటేశ్వర రావు, డిసిహెచ్ఎస్ పద్మ, డీఎస్పీ భవ్య కిషోర్, తదితర అధికారులు పాల్గొన్నారు.

## కీలక అంశాలపై సమీక్ష ర్యాలీలు నిర్వహించాలని కలెక్టర్ ప్రశాంతి ఆదేశాలు




**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి ఆదేశాలు –కీలక అంశాలపై సమీక్ష ర్యాలీలు నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వ సేవలను ప్రజలకు వాట్సాప్, 9552300009 ద్వారా చేరువ చేయడం రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. జూమ్ లింక్ ద్వారా ప్రభుత్వ శాఖల కీలక సమాచారం అప్‌లోడ్ జిల్లాలోని అన్ని శాఖాధిపతులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు తమ శాఖలకు సంబంధించిన జీవోలు, సర్క్యులర్లు, తీర్పులు, నిబంధనలు, తదితర పత్రాలను తప్పనిసరిగా హ్ట్టప్స్://వజ్గ్.ఖజా.గ్రశీజ.ఐఅ లింక్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. భవిష్యత్ కార్యాచరణకు ఇది మార్గదర్శకంగా నిలుస్తుందని కలెక్టర్ వివరించారు. ఇతర సమీక్ష అంశాలు ఆధార్ సవరణలు, రెవెన్యూ సమస్యలు, నీటి పన్ను, పునః సర్వే, అన్నదాత సుఖీభవ ఫిర్యాదులు, స్వామిత్వ ధృవీకరణ, అసెస్‌మెంట్‌లు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించబడింది. ఈ సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్. చిన్న రాముడు, డీఆర్‌వో టీ. సీతారామ మూర్తి, ఇంచార్జీ పిడి హౌసింగ్ ఎస్. భాస్కర్ రెడ్డి, డిఎల్డివో పి వీణాదేవి, డివిపివో వి శాంతా మణి, డ్వామా పిడి ఎమ్. నాగ మల్లేశ్వర రావు, సిపివో ఎల్. అప్పల కొండ, జిల్లా వ్యవసాయ అధికారి ఎస్. మాధవరావు, ఇంజనీరింగ్ అధికారులు, కలెక్టరేట్ పర్యవేక్షకులు , వివిధ శాఖల జిల్లా అధికారి, మున్సిపల్, రెవెన్యూ, హౌసింగ్, వ్యవసాయ, పంచాయతీ రాజ్, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

## "మీ కోసం" కార్యక్రమంలో అధికారులు తప్పనిసరిగా పాల్గొని సమస్యలు పరిష్కరించాలి

**– కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత**

**కొవ్వూరు, మేజర్ న్యూస్ :** "మీ కోసం – పీజీఆర్ఎస్" వేదికలో పొందిన అర్జీలపై సంబంధిత శాఖల అధికారులు తక్షణ చర్యలు తీసుకొని ప్రజలకు సంతృప్తికరమైన పరిష్కారం అందించాలని, డివిజన్ స్థాయి అధికారులు తప్పనిసరిగా కార్యక్రమంలో హాజరై సమస్యలను గుర్తించి పరిష్కరించాలని కొవ్వూరు ఆర్డీవో శ్రీమతి రాణి సుస్మిత సూచించారు. సోమవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన "మీ కోసం – పీజీఆర్ఎస్" కార్యక్రమంలో వచ్చిన అర్జీలను ఆమె స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ, ఈ వేదిక ద్వారా మొత్తం 13 అర్జీలు స్వీకరించామని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను అధికారుల సమన్వయంతో వేగంగా పరిష్కరించేందుకు ప్రతివారం రెండు రోజులు శాఖల వారీగా సమావేశాలు నిర్వహించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. వచ్చిన ప్రతి అర్జీని పరిశీలించి, సమస్య పరిష్కారానికి కట్టుబడి పని చేస్తామని పేర్కొన్నారు.



## టిఆర్ఎస్ అర్జీల పరిష్కారమే లక్ష్యం

**– పాడా పీడి ఎన్‌వివి సత్యనారాయణ**




**పిఠాపురం, మేజర్ న్యూస్ :** పిఠాపురం ఏరియా డవలప్మెంట్ అథారిటీ (పాడా) కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ ఎస్ కార్యక్రమంలో పాడా పీడీ (ఎఫ్ ఏసి) ఎన్ వీ వీ సత్యనారాయణ పాల్గొని పిఠాపురం పరిసర ప్రాంతాల ప్రజలు నుంచి వివిధ అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పీజీఆర్ఎస్ కార్యక్రమంలో వివిధ అంశాలపై 74 అర్జీలు అందాయన్నారు. ఇందులో రెవెన్యూ –21, మునిసిపాలిటీ–23, పిఆర్ – 5,పెన్షన్–8, ఇతరములు –17 వచ్చాయని ఆయన తెలిపారు. ఈ అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కారానికి కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. అర్జీ దార్లు వారి యొక్క అర్జీల నమోదు మరియు నమోదైన అర్జీల గురించి వాటి యొక్క స్థితి దానికి సంబంధించి సమాచారం తెలుసుకోవాడానికి 1100 (డబల్ వన్ డబల్ జీరో) కి నేరుగా కాల్ చేయవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాడా ఏపీడీ వసంత మాధవి, కొత్తపల్లి మరియు పిఠాపురం తహసీల్దార్లు, ఎంపీడీఓలు తదితరులు పాల్గొన్నారు.

# ఆంగ్లంపై పట్టు సాధించడం అవసరం




**– ఆదిత్య యూనివర్సిటీ ప్రో.ఛాన్సలర్ డా.సతీష్ రెడ్డి**

**గండేపల్లి, మేజర్ న్యూస్ :** సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీకి చెందిన బి.టెక్ సి.ఎస్.ఇ.బ్రాంచ్‌కి చెందిన మొదటి సంవత్సరం విద్యార్థులకు నేటి నుంచి తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన విద్యార్థి తల్లిదండ్రుల సమావేశంలో యూనివర్సిటీ ప్రో.ఛాన్సలర్ డా. నల్లమిల్లి సతీష్ రెడ్డి అధ్యక్షత వహించి మాట్లాడుతూ విద్యార్థులు తమ కర్తవ్యాన్ని లక్ష్యాలను నిరంతరం గుర్తెరిగి మసలుకోవాలి అన్నారు. ఉన్న స్థాయి నుంచి ఉన్నత స్థాయికి చేర్చేది విద్య మాత్రమే అని అన్నారు. ఆదిత్య పై అపార నమ్మకం తో తమ చిన్నారులను తమ సంస్థలో చేర్పించిన తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలియజేస్తూ విద్యార్థి ఉన్నతికి ఆదిత్య యాజమాన్యం ఎల్లవేళలా కృషిచేస్తుందని అయితే తల్లిదండ్రులు మీ వంతు సహకారం ఆదిత్యకు అందిస్తే అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవడం ఎంతో సులభం అని తెలిపారు. ఇంజనీరింగ్ విద్యార్థులు ఆంగ్లంపై పట్టు సాధించి నప్పుడే బి.టెక్ పట్టాతో పాటు మంచి వార్షిక ఆదాయంతో ఉద్యోగ నియామక పత్రంతో కళాశాల నుండి నేరుగా ఉద్యోగంలో అడుగు పెట్టవచ్చు అని అందుకు ఆదిత్య తీసుకుంటున్న ప్రణాళిక బద్ధమైన నియమనిబంధనలు అనుసరించవల సిన భాధ్యత విద్యార్థులపై ఉందని అన్నారు.

విద్యార్థి యొక్క నియమావళి ఆదిత్య యొక్క నిబంధనలు హాజరు యొక్క ప్రాముఖ్యత వారాంతపు నెలవారీ పరీక్షల వివరాలు తదితర విషయాల గురించి విభాగాధిపతి తెలిపారు. విద్యార్థికి ఉండవలసిన లక్షణాలు, దీక్షపట్టుదల, గురించి వివరించారు.తాను ఏమి కావాలనుకుంటున్నారనే విషయంపై నిర్దిష్టమైన అభిప్రాయం ఏర్పాటు చేసుకుని ఆమార్గంలో ముందుకు సాగాలని సూచించారు. సరైన విధానంలో ఉపయోగిస్తే విజ్ఞానంతో ఎంత అభివృద్ధి సాధించవచ్చు అనే విషయాన్ని ఏ.ఐ.ద్వారా వివరించారు. చెడుకు వినియోగిస్తే అధోగతి పాలవడం జరుగుతుందని మనం ఏవిధంగా మసలుకోవాలి అనే విజ్ఞతను కలిగి ఉండాలని డా.సతీష్ రెడ్డి వివరించారు.

ఈ కార్యక్రమంలో డిప్యూటీ ప్రో.ఛాన్సలర్ డా.ఎం. శ్రీనివాస రెడ్డి, వైస్ ఛాన్సలర్ ప్రో. ఎం,బి,శ్రీనివాస్,ప్రో. వైస్ ఛాన్సలర్స్ డా. ఎస్. రమాశ్రీ, డా. ఆదిరెడ్డి రమేష్, రిజిస్ట్రార్ డా.జి. సురేష్,టెక్నికల్ హబ్ సి.ఈ.ఓ.బాబ్జి నీలం, విభాగాధిపతులు విద్యార్థినీ విద్యార్థులు తల్లితండ్రులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## జాయింట్ ఎల్‌పిఎంలకు గడువు పొడిగింపు

**– తహశీల్దార్ వెంకటలక్ష్మీ**



**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** జాయింట్ ల్యాండ్ పార్సిల్ (ఎల్‌పిఎం) ధరఖాస్తుకు రాష్ట్ర ప్రభుత్వం గడువును పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందని, తహశీల్దార్ సిహెచ్.వెంకటలక్ష్మీ తెలిపారు. ఈసందర్భంగా ఆమె తెలుపుతూ సబ్ డివిజన్ కోసం ధరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం గడువును డిశంబర్ 31,2025 వరకు గడువును పొడిగించడం జరిగిందని తహశీల్దార్ తెలిపారు. కావున ఈ అవకాశం రైతులు సద్వినియోగం చేసుకోవలసినదిగా ఆమె తెలిపారు.

# మహిళల్లో హైందవ చైతన్యం తీసుకురావడమే ధ్యేయం!






**– రామసేన అధ్యక్షులు,**
**బీజేపీ నాయకులు కంబాల శ్రీనివాసరావు**

**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** మహిళల్లో హైందవ చైతన్యం తీసుకురావడమే తన ధ్యేయమని రామసేన అధ్యక్షులు, బీజేపీ నాయకులు కంబాల శ్రీనివాసరావు పేర్కొన్నారు.రంపచోడవరంలో బంగారు వరలక్ష్మి కానుక–4 లక్కీ డ్రా సోమవారం విజయవంతంగా నిర్వహించారు. డ్రాలో గెలిపోందిన 70 మంది మహిళలకు ఉచితంగా బంగారు రూపులు పంపిణీ చేసారు. మహిళా మూర్తుల్లో హైందవ చైతన్యం తీసుకురావాలనే సంకల్పంతో బంగారు వరలక్ష్మి కానుక కార్యక్రమం నిర్వహిస్తున్నామని విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షులు, బీజేపీ నాయకులు కంబాల శ్రీనివాసరావు అన్నారు. రంపచోడవరంలోని ఒక కళ్యాణ మండపంలో సోమవారం నిర్వహించిన బంగారు వరలక్ష్మి కానుక లక్కీ డ్రా కార్యక్రమానికి రంపచోడవరం తో పాటు చుట్టు పక్కల గ్రామాల నుంచి వేలాది మంది మహిళలు తరలి వచ్చారు. ముందుగా కంబాల శ్రీనివాసరావు, శ్రీమతి పద్మావతి దేవి గంగారత్నం దంపతులకు అర్చకులు డాక్టర్ వల్లూరి జగన్నాథరావు శర్మ పూర్ణ కలశంతో స్వాగతం పలికారు. జ్యోతి ప్రజ్వలన చేసి, లక్కీ డ్రా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ లక్కీ డ్రా లో గెలుపొందిన 70 మంది మహిళలకు ఉచితంగా బంగారు రూపులను కంబాల శ్రీనివాసరావు దంపతులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కంబాల శ్రీనివాసరావు మాట్లాడుతూ గిరిజన సంస్కృతి, సాంప్రదాయాల పరిరక్షణ కృషి చేస్తామన్నారు. రామసేన సంస్థ ద్వారా ఆధ్యాత్మిక, ధార్మిక కార్యక్రమాలు నిర్వహిస్తూ, ఆలయాల అభివృద్ధి, ప్రజా సేవా కార్యక్రమాలు ధ్యేయంగా నిర్వహిస్తున్నామన్నారు. ధర్మ పరిరక్షణకు ప్రతి ఒక్కరు కలిసి నడవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రామసేన సభ్యులు, బీజేపీ నాయకులు వరసాల ప్రసాద్, బత్తుల నానాజీ, రామసేన అధ్యక్షులు ఉంగరాల మణిరత్నం, ఆచ్చారావు, పసల గణేష్, దేశాల నరేష్, మందపాటి సతీష్, ఎం.శ్రీనివాసరావు, ఎ.వెంకటేశ్వరావు, నల్లమిల్లి రామారెడ్డి, రాయపాటి సత్తిబాబు, కె.సుధా, గుర్ల అంక శ్రీనివాసరావు రెడ్డి, ముల్లి నాగమణి, జోన్నలగడ్డ నాగ వెంకట సత్యనారాయణ, పి.వెంకట లక్ష్మి, పింజర్ల నాగవీర భద్రరావు, కరణం కోటేశ్వరరావు, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

## "ప్రజా సమస్యల పరిష్కార వేదిక - మీ కోసం"లో వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలి

**– 1100 కాల్‌సెంటర్ నంబర్‌కు ఫిర్యాదులు, అర్జీలు తెలియజేయండి**
**– ఆర్డీవో ఆర్. కృష్ణ నాయక్**



**రాజమహేంద్రవరం,మేజర్‌న్యూస్ :** ప్రజల సమస్యలు త్వరితగతిన పరిష్కారమవడమే లక్ష్యంగా "మీ కోసం –పీజీఆర్ఎస్" వేదికలో వచ్చిన ప్రతి అర్జీని సమగ్రంగా పరిశీలించి, అర్జీదారులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని డివిజన్ స్థాయి అధికారులను ఆర్డీవో ఆర్. కృష్ణ నాయక్ ఆదేశించారు. సోమవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన "మీ కోసం – పీజీఆర్ఎస్" కార్యక్రమంలో రెండు అర్జీలను డివిజన్ స్థాయి అధికారులతో కలిసి స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలు తమ సమస్యలను ప్రభుత్వానికి తెలియజేయడానికి 1100 కాల్‌సెంటర్ నంబర్ ద్వారా ఫిర్యాదులు, అర్జీలు తెలియజేయవచ్చునని తెలిపారు. ఈరోజు రెండు అర్జీలు స్వీకరించబడినట్లు తెలిపారు. ప్రతి దరఖాస్తును నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరించి, బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని అధికారులకు సూచించారు.

ఈరోజు స్వీకరించిన కొన్ని అర్జీలు: పి. శేష సాయి ప్రసాద్, కాపవరం గ్రామం, కోరుకొండ మండలం ...తన ఆస్తి సెక్షన్ 22ఎ (1సి) కింద నమోదు చేయబడిందని, దానిని సరిచేయాలని కోరుతూ దరఖాస్తు చేశారు. వి. నారాయణమూర్తి, గాదవాడ గ్రామం, కోరుకొండ మండలం తన పొలం కొంతమంది ఆక్రమించారని, రీ–సర్వే చేసి తన హక్కు స్థలాన్ని తిరిగి అప్పగించవలసిందిగా కోరుతూ దరఖాస్తు సమర్పించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా స్థాయి పిజిఆర్ఎస్‌లో 195 అర్జీలు స్వీకరణ

**– ఆగస్టు 15 వేడుకల సందర్భంగా శకటాల, స్టాల్స్ ప్రదర్శన ఆయాశాఖల పనితీరు ప్రతిభంభించేలా ఉండాలి**
**– కలెక్టర్ పి.ప్రశాంతి**



**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను స్వీకరించడం, వాటిని నియమిత సమయంలో పరిష్కారం చెయ్యడం తప్పనిసరి అని జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి స్పష్టం చేశారు. సోమవారం కలెక్టరేట్ లో నిర్వహించిన పిజిఆర్ఎస్ లో ప్రజల నుంచి జాయింట్ ఎస్ చిన్న రాముడు తో కలిసి కలెక్టర్ అర్జీలను స్వీకరించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి మాట్లాడుతూ, ప్రతి సోమవారం జిల్లా స్థాయిలో, అదే విధంగా క్షేత్ర స్థాయిలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించడం జరుగుతోందని పేర్కొన్నారు. ఆయా అర్జీలను సత్వర పరిష్కారం కోసం తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వాటిని నిర్ణిత సమయంలోగా పరిష్కారం అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని, ఆ మేరకు జవాబుదారీతనం కలిగి ఉండాలనీ స్పష్టం చేశారు. రెవెన్యూ 77, పంచాయతీ రాజ్ 45 , పోలీస్ 20 , పాఠశాల విద్యా 10 , ఇతర శాఖలకు చెందిన 43 అర్జీలు పరిష్కారం కోసం స్వీకరించడం జరిగింది. ఆగస్టు 15న నిర్వహించే వేడుకల్ని అత్యంత ఘనంగా నిర్వహించాలన్నారు. ఆమేరకు ఆయా ప్రభుత్వ శాఖలకు చెందిన సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు ప్రతిబింబించేలా స్టాల్స్ ప్రదర్శన,శకటాల ప్రదర్శన ఉండాలని స్పష్టం చేశారు. ఇప్పటి నుంచి ఒక చక్కటి ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్న రాముడు, డీ ఆర్వో టి సీతారామ మూర్తి, ఎస్‌డిసి భాగ్య లక్ష్మి, సీపివో ఎల్అప్పల కొండ, డిఎల్‌డివో ఏ.స్లీవారెడ్డి, ఇతరశాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## తీరనున్న ముప్పునీటి సమస్య

**– దశాబ్ద కాలంగా నోచుకోని లొల్ల,**
**పలివెల డ్రైన్ పనులకు కూటమి ప్రభుత్వంతో మోక్షం**





**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** ఆత్రేయపురం మండలం లొల్ల, వాడపల్లి, మెర్లపాలెం, ఆత్రేయపురం తదితర గ్రామాల రైతులు ఇటీవల ముంపు నీటి సమస్యతో సతమతమవుతున్నారు. బ్యాంకు కెనాల్ మట్టం ఏ మాత్రం పెరిగిన రైతుల పంట పొలాలు ముంపు బారిన పడుతున్నాయి. ఈ తరుణంలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు రెండు కోట్ల 50 లక్షలు నిధులు మంజూరు చేసి సైఫన్ నిర్మాణ పనులు పూర్తి చేశారు. అయితే దీనికి సంబంధించిన లొల్ల, పలివెల డ్రైన్ పనులను వదిలేయడంతో సమస్య మొదటికి వచ్చింది. ఈ సమస్యని గుర్తించిన రైతుల వెతలు దగ్గర నుండి చూసిన ఎమ్మెల్యే బండారు సత్యానందరావు కృషితో జిల్లా కలెక్టర్ రావిరాల మహేష్ కుమార్‌తో మాట్లాడి రూ.19 లక్షలు 40 వేలు శాంక్షన్ చేయించారు. పనులను జిల్లా ప్రాజెక్ట్ కమిటీ ఉపాధ్యక్షులు కరటూరి నరసింహారావు డ్రైన్ పనులను కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. దీంతో ఆ ప్రాంత రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ పనులు మరో వారం రోజులు పాటు జరగనున్నాయి. దశాబ్దాల తరబడి తీరని కల కూటమి ప్రభుత్వ నెరవేర్చడంతో ఈ ప్రాంత రైతులు హర్షాతి రేకాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో డ్రైన్ ఏఈ జయలక్ష్మి, నీటి సంఘం అధ్యక్షులు జుజ్జ వరపు హరిబాబు, పుత్ర సాయి, బందెల శ్రీనివాస్, చిట్టూరి త్రినాధరావు, గుల్లపల్లి శ్రీనివాసరావు, మండపాక సత్తిబాబు తదితరులు ఉన్నారు.

## మందేశ్వర ఆలయంలో సింగర్ మనో



**కొత్తపేట, మేజర్ న్యూస్ :** మండల పరిధిలో మందపల్లి గ్రామంలో వేంచేసిన శ్రీ మందేశ్వర(శనీశ్వర) స్వామి అలయానికి ప్రముఖ సింగర్ మనో కుటుంబ సమేతంగా సోమవారం విచ్చేసారు.వీరికి ఈవో సురేష్ బాబు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.అనంతరం స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరూ శనీశ్వర స్వామి ఆశీర్వాదం పొందితేనే సకలసౌక్యాలు వరిస్తాయని అన్నారు.శనిదోషం ఉన్నవారే కాకుండా ప్రతి ఒక్కరు దర్శించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ చింతం కృష్ణ,ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## బోదునూరు గ్రామానికి ఆర్వో ప్లాంట్‌కి భూమి పూజ నిర్వహించిన జడ్పిటిసి ఎంపీపీ



**కూనవరం,మేజర్‌న్యూస్ :** కూనవరం మండలంలోని బోదు నూరు పాల గూడెం గ్రామాలకు త్రాగునీరు లేక గిరిజనులు అనేక ఇబ్బందులు పడుతున్నారని మీ సమస్యల వరిష్కరించవలసిందిగా ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి కలెక్టర్‌కి కూనవరం జడ్పిటిసి మరియు ఎంపీపీ అనేక సార్లు అధికారులు దృష్టికి తీసుకు వెళ్ళటంతో స్పందించిన చిత్తూరు ఐటిడిఏ పిఓ బోదు నోరు పాలగూడెం గ్రామాలకు రక్షిత నీటి పథకం మంజూరు చేయించినారు. ఈ సందర్భంగా సోమ వారం నాడు కోడవరం ఎంపీపీ పాయం రంగమ్మ జడ్పిటిసి విజయ భూమి పూజ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కూ టమి నాయకులు బరపాటి ప్రకాష్ దాసరి నరేంద్ర నోముల రామారావు ఎంపిటిసి నాగరాణి తదితరులు పాల్గొన్నారు.

# సివిల్ సర్వీస్‌లో ఉత్తమ ఫలితాలు సాధించేలా విద్యార్థులు కృషి చేయాలి





**కాకినాడ, మేజర్ న్యూస్ :** యూనివర్శిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కాకినాడ (యుసిఇకె)లో ప్రారంభమైన దీక్షారంబ్ రెండు వారాల ఇండక్షన్ ప్రోగ్రామ్ మొదటి సంవత్సరం విద్యార్థులకి ఈనెల 4వ తేదీ నుండి 16వ తేదీ వరకు జరగనుంది. మొదటి సంవత్సరంలో ప్రవేశం పొందిన విద్యార్థులకి ఇండక్షన్ ప్రోగ్రామ్‌లో భాగంగా సోమవారం సిబిఐ మాజీ జాయింట్ డైరెక్టర్ వి.వి.లక్ష్మీనారాయణ, ఐపిఎస్ మోటివేషనల్ స్పీచ్ ఇచ్చారు. లేటెస్ట్ టెక్నాలజీలపై ఫోకస్ చేయాలని, భవిష్యత్తులో ఏఐ టెక్నాలజీకి తగినట్లుగా ఉద్యోగ అవకాశాల కోసం మరియు సివిల్ సర్వీసెస్ సాధించడానికి ఇప్పటి నుంచే మంచి ప్రణాళికలు వేసుకుని కృషి చేయాలని సూచించారు. యువత స్మార్ట్ ఫోన్, చెడు వ్యసనాలకు ఆకర్షితులు కాకుండా లైబ్రరీ, క్రీడా వసతులను వినియోగించుకుని భవిష్యత్తులో యూనివర్శిటీకి మరియు భారతదే శానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో ఉపకులపతి ప్రొఫెసర్ సిఎస్ఆర్ కె.ప్రసాద్, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎన్.మోహన్‌రావు, వైస్ ప్రిన్సిపాల్స్ ప్రొఫెసర్ జివిఎస్ఆర్.దీక్షితులు, ప్రొఫెసర్ ఎం.స్వరూపారాణి, కో-ఆర్డినేటర్‌లు డాక్టర్ వి.జయప్రసాద్, డాక్టర్ జి.శ్యామ్‌కుమార్, డాక్టర్ ఎస్.సత్యవేణి పాల్గొన్నారు.

# ఘనంగా మంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ పుట్టినరోజు వేడుకలు



**అమలాపురం, మేజర్ న్యూస్ :** కేంద్ర ఉక్కు శాఖ, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ పుట్టినరోజు సందర్భంగా సోమవారం భీమవరం ఆయన స్వగృహం నందు బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు మానేపల్లి వేమా, కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యులు నల్లా పవన్ కుమార్, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షులు అడబాల సత్యనారాయణ మంత్రిని కలిసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

# యువత దేశాభివృద్ధికి ఆదర్శం




**కాకినాడ, మేజర్ న్యూస్ :** స్థానిక సాంబమూర్తి నగర్‌లో గల ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలలో సోమవారం కళాశాల ప్రాంగణంలో 'వ్యక్తిత్వ వికాసం' పై ప్రథమ సంవత్సరం విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె.కరుణ తెలిపారు. ఈ సందర్భంగా ఆదిత్య డిగ్రీ మరియు పి.జి. కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డా॥ బి.ఇ.వి.యల్ నాయుడు మాట్లాడుతూ ప్రతీ తరాన్ని ముందుకు నడిపించేది యువశక్తే, నేటి యువతకు సమాజంపట్ల బాధ్యత వుండాలని అన్నారు. ప్రతి ఒక్కరినీ గౌరవిస్తూ మానవతా విలువలని పాటించాలని అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ కరుణ మాట్లాడుతూ తమ కళాశాలలో ఎన్.ఎస్.ఎస్ వారు నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి కి ముఖ్య అతిధిగారామకృష్ణమఠం,రాజమహేంద్రవరం నుంచి స్వామీజి సేవ్యా నంద స్వామివారు విచ్చేసారని తెలిపారు. ఈకార్యక్రమంలో స్వామివారు విద్యార్థినులను ఉద్దేశించి, పాజిటివ్ థింకింగ్, మనస్సును, ఆలోచనలను ఎలా కంట్రోల్ చేయాలి,అనే ముఖ్య సందేశాన్ని అందించారని అన్నారు. 'బీగుడ్‌డూగుడ్' అని స్వామివారు చక్కని సందేశాన్ని యువతకు అందించారు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పాల్గొన్న సేవ్యానంద స్వామివారు మాట్లాడుతూ మహాత్మగాంధీ వంటి మహానేతలు 1921లో స్వామి వివేకానందను కలవడం జరిగిందని అన్నారు. ప్రతి వ్యక్తి ఒక లక్ష్యాన్ని పెట్టుకుని దానికోసం, ప్రయత్నిస్తే విజయం సాధ్యపడుతుందని అన్నారు. రోజు వారి దినచర్యలో పుస్తక పఠనం కూడా వుండాలని అన్నారు. మెదడును, ఆలోచనలను కంట్రోల్ చేసుకునే సాధనం పుస్తక పఠనం అన్నారు. విద్యార్థినీలకు వ్యక్తిగత వికాసం,ధైర్యం,అవసరమనితెలిపారు. విద్యార్థినులతో ప్లెడ్జ్ చేయించారు .ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జి.నాగ శ్రీకాంత్, ఎన్.ఎస్.ఎస్. ప్రోగ్రాం ఆఫీసర్ పి.సురేఖ దేవి, ఫిజికల్ డైరెక్టర్ ఎన్. సత్యవతి, ఎన్.ఎస్.ఎస్.వాలంటీర్లు మరియు విద్యార్థినులు పాల్గొన్నారు.

# పనిచేయని సెల్‌ఫోన్‌లు ఐసిడిఎస్ కార్యాలయంలో అప్పగింత



**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** పనిచేయని ఫోన్‌లు ఇచ్చి, యాప్‌ల భారం పెంచుతూ అనేక ఇబ్బందులకు అంగన్‌వాడీలను గురిచేస్తున్నారని తెలుపుతూ సోమవారం పెద్దాపురం ఐసిడిఎస్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ సిబ్బంది ఫోన్‌లతో ధర్నా నిర్వహించి ఐసిడిఎస్ కార్యాలయంలో ఫోన్‌లు అప్పగించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ నాయకులు దాడి బేబి, ఎస్తేర్ రాణిలు మాట్లాడుతూ అంగన్‌వాడీల మీద విపరీతమైన యాప్‌ల భారం పెంచారని, ఏ మాత్రం పనిచేయని ఫోన్‌లు ఇచ్చారని, లబ్దిదారులతో సహా అందరూ ఫేసియల్ యాప్ వేయాలని చెబుతున్నారని, ఆ ఫోన్‌లతో లబ్దిదారుల ఫేస్‌లు సరిగ్గా రాక యాప్ తీసుకోవడం లేదని, కావున తక్షణం ఈ యాప్‌లను రద్దు చేయాలని, ఫోన్‌లను వెనక్కు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఐసిడిఎస్ కార్యాలయంలో కార్యాలయ సిబ్బంది ఫోన్‌లు తీసుకోవడానికి నిరాకరించడంతో ఐసిడిఎస్ కార్యాలయంలో ఫోన్‌లు వదిలేసి అంగన్‌వాడీలు వచ్చారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది నాగమణి, స్నేహలత, దేవి, పద్మ, విజయలక్ష్మీ, వరలక్ష్మీ, పాపాయమ్మ, వెంకటలక్ష్మీ, కుమారి, మహాలక్ష్మీ, ఫాతిమా, సిఐటియు నాయకులు క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సెల్ ఫోన్లను ఐసిడిఎస్‌లో అప్పగించిన అంగన్వాడీలు



**రంపచోడవరం,మేజర్‌న్యూస్ :** ఎఫ్ఆర్ఎస్ యాప్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ వారి దగ్గర ఉన్న సెల్‌ఫోన్లను ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో సోమవారం అంగన్వాడీ కార్యకర్తలు అప్పగించారు. రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా అంగన్ వాడీ ప్రాజెక్టు కార్యాలయం వద్ద ఎఫ్ఆర్ఎస్ యాప్ ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రాజెక్ట్ అధ్యక్షురాలు కారం రామలక్ష్మి ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించి, అంగన్వాడీలు తమవద్ద ఉన్న సెల్‌ఫోన్‌లను ఐసిడిఎస్ కార్యాలయంలో అప్పగించడం జరిగింది. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ అధ్యక్షురాలు రామలక్ష్మి మాట్లాడుతూ ఎఫ్ఆర్ఎస్ యాప్ ను రద్దు చేసి అన్ని యాప్‌లను కలిపి ఒకే యాప్‌ను చేయాలని, నాణ్యమైన సెల్‌ఫోన్‌లు అంగన్వాడీ వర్కర్స్ కు ఇవ్వాలని, నాణ్యమైనవి ఇస్తేనే ఆన్లైన్‌వర్క్ చేస్తామని పేర్కొన్నారు. కనీస వేతనం 26వేల రూపాయలు ఇవ్వాలని, ఎన్నికల ముందు అంగన్వాడీలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని,అంగన్వాడీలకు సంక్షేమ పథకాలు వర్తింప చేయాలని డిమాండ్ చేస్తూ అంగన్వాడీలు వద్ద ఉన్న సెల్ ఫోన్ లను తిరిగి రంపచోడవరం ఐసిడిఎస్ కార్యాలయంలో అప్పగించడం జరిగింది. ఈకార్యక్రమానికి మద్దతుగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె.శాంతిరాజు పాల్గొన్నారు. అంగన్వాడీ ప్రాజెక్టు నాయకులు సింగారమ్మ, సత్యవేణి, కొమరం మంగాయమ్మ, పి.పార్వతి, అంగన్వాడీ వర్కర్స్ పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే కొండబాబు చేతుల మీదుగా తరగతి గదుల భవనం ప్రారంభం





**కాకినాడ,మేజర్‌న్యూస్ :** పీఆర్ ప్రభుత్వ వృత్తి విద్యా జూనియర్ కళాశాలలో నాలుగు తరగతి గదుల నూతన భవనాన్ని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరావు (కొండబాబు) ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బొర్రా గోపీమూర్తి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొండబాబు మాట్లా డుతూ ఇంతకుముందు 2016లో కూడా ఒక భవనాన్ని ప్రారంభించామని, మరలా ఇప్పుడు మరో నూతన భవనాన్ని ప్రారంభించడం చాలా సంతోషమని, వొకేషనల్ కళాశాలకు ఇంకా తరగతి గదులు, ల్యాబ్స్, విషయంలో అన్నిటికీ తన వంతు సహకారం ఎప్పుడూ ఉంటుదని, మీకు అన్ని సౌకర్యాలు కల్పిస్తానని తెలిపారు. ఎమ్మెల్సీ గోపీమూర్తి మాట్లాడుతూ కళాశాలకు ఏం కావాలో అన్ని తనకు రాత పూర్వకంగా తెలపాలని, పైఅధికారులతో మాట్లాడతానని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల మాజీ ప్రిన్సిపాల్ మావూరి తిరుపతిరెడ్డిని డిఐఈఓ ఐ.శారద అధ్యక్షతన సన్మానించారు.

ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వడ్డి రాజేంద్ర ప్రసాద్, పిఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతుల రాంబాబు, పైడా ట్రస్టు చైర్మన్ పైడా వెంకట నారాయణ, ఏపీఇడబ్ల్యూఐడిసి డిఈ ఆర్.జయకర్, ఏఈ కె.వెంకటరాజు, ఎన్.ఎస్.ఎస్. ప్రోగ్రాం అధికారులు పిల్లి వి.శివ ప్రసాద్, కె.నిరంజన్ కుమార్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

# పుట్టిన గంటలోపే శిశువుకు తల్లి పాలు పట్టించాలి

**– తల్లిపాలు అమృతంతో సమానం**
**– జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్**



**అమలాపురం, మేజర్ న్యూస్ :** పుట్టిన గంటలోపే శిశువుకు తల్లి (ముర్రు)పాలు పట్టించాలని, తల్లిపాలు అమృతంతో సమానమని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ వెల్లడించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ నందు ఆగస్టు 1 నుంచి వారం రోజులు పాటు తల్లిపాల ప్రాముఖ్యత వివరిస్తూ చేపట్టిన వారోత్సవాలు ప్రచార పత్రికలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యంత శ్రేష్టమైనవి తల్లిపాలని శిశువులకు అమృతతుల్యమైనవన్నారు. తల్లి పాలు జీవితకాలం పనిచేసే టీకాగా భావించాలన్నారు, ప్రతి శిశువు మెదడు చురుకుగా పనిచేయడంతోపాటు, జ్ఞాపకశక్తి పెరిగేందుకు దోహదపడతాయన్నారు. ఆరునెలల పాటు శిశువుకు రోజు తల్లి పాలు తాగించాలని, ఈ పాలలో విటమిన్–ఏ అధిక మోతాదులో ఉండడం వల్ల పిల్లల కళ్ళు ప్రకాశవంతంగా ఉంటాయని, 6 నెలల వరకు శిశువుకు కేవలం తల్లిపాలు మాత్రమే త్రాగించాలన్నారు. నీళ్లు, తేనె, గ్లూకోజ్ నీరు, జంతువుల పాలు, బయట విక్రయించే పాలు వంటివి ఇవ్వడం ద్వారా శిశువు ఆరోగ్యం పాడవుతుందని, తల్లిపాల ప్రాముఖ్యతపై మహిళలకు అవగాహన పెంచాలన్నారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి తల్లిపాలు దోహదపడతాయన్నారు. శిశువు పుట్టిన దగ్గర నుంచి రెండేళ్ల వయస్సు వచ్చే వరకు తల్లి పాలు పట్టిం చాలన్నారు. తల్లిపాలు బిడ్డ మానసిక, శారీరకంగా ఎదుగులకు ఉపయోగపడతాయన్నారు. చాలా మంది తల్లులు పిల్లలకు తేనె, నీళ్లు వంటివి పడుతుంటారని, అలా చేయడం వల్ల బిడ్డ అనారోగ్యానికి గురవుతారన్నారు. రెండేళ్ల నుంచి బిడ్డకు అనుబంధ పోషకాహారాన్ని అందించాలన్నారు.ప్రతి పల్లెలోనూ తల్లిపాల ప్రాముఖ్యతపై చర్చ జరగాలన్నారు. పిల్లల్లో వ్యాధి నిరోధకశక్తి పెరగడానికి తల్లి పాలు ఎంతో దోహదపడతాయన్నారు. ఈనెల ఒకటి నుంచి ఏడో తేదీ వరకు మండల, గ్రామస్థాయిల్లో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించి, తల్లి పాల ప్రాముఖ్యతపై ప్రపంచ తల్లిపాల వారం ప్రతి సంవత్సరం ఆగస్టు 1 నుండి 7 వరకు జరుగుతుందనీ, తల్లి పాలు శిశువులకు ఎంత ముఖ్యమో, దాని వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాల గురించి అవగాహన కల్పించడమే ఈ ఉత్సవాల ప్రధాన ఉద్దేశ్యమన్నారు. ప్రతి సంవత్సరం ఈ వారోత్సవాలు ఒక ప్రత్యేకమైన థీమ్‌తో జరుగుతాయి. 2025 సంవత్సరానికి తల్లిపాలను ప్రాధాన్యతనివ్వండి, స్థిరమైన మద్దతు వ్యవస్థలను సృష్టించండి అనే ఇతివృత్తంతో ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నారన్నారు. ఈ థీమ్, కేవలం తల్లిపాలు ఇవ్వడం గురించే కాకుండా, తల్లులకు అవస రమైన అన్ని రకాల మద్దతు వ్యవస్థలను ఏర్పాటు చేయడంపై కూడా దృష్టి పెడుతుందన్నారు. దీనిలో భాగంగా పనిచేసే చోట తల్లులకు తగిన సౌకర్యాలు కల్పించడం, ఆరోగ్య నిపుణుల సలహాలు, కుటుంబం సమాజం నుండి మద్దతు వంటి అంశాలను ప్రోత్సహించాలన్నారు. పోస్టర్ కేర్ (తాత్కాలిక దత్తత) ఆరు సంవత్సరాలు పైబడిన 18 సంవత్సరాలు లోపు పిల్లలను రెండు సంవత్సరాల పాటు పెంచి తదుపరి శాశ్వతంగా దత్తత పొందే అవకాశం పోస్టర్ కేర్ ద్వారా కలుగు తుందన్నారు. తల్లిదండ్రుల సంరక్షణ లేని పిల్లలకు తాత్కాలిక ఇల్లు మరియు సంరక్షణ అందించే వ్యవస్థ అన్నారు. ఈ పిల్లలు వివిధ కారణాలవల్ల తమ కుటుంబాలలో ఉండలేనప్పుడు పోస్టర్ కేర్ ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ పిడి శాంత కుమారి, సిడిపిఓలు సిబ్బంది పాల్గొన్నారు.


## ఎక్సైజ్ ఆఫీస్ ఎదుట వైన్ షాపుల నిర్వాహకులు ఆందోళన..






**అమలాపురం,మేజర్‌న్యూస్ :** అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో వైన్ షాపు నిర్వహకులు సోమవారం ఆందోళన చేపట్టారు. షాపులకు తాళాలు వేసి ఎక్సైజ్ ఆఫీసులో ఇచ్చేసిన వైన్ షాప్ నిర్వాహకులు తమ తమ ఆవేదన వ్యక్తం చేశారు.ఎక్సైజ్‌అధికారుల వేధింపులు భరించలేకపోతు న్నామని ప్రతి నెల షాపుకు రూ.లక్ష ఇవ్వాలని ఎక్సైజ్ అధికారుల డిమాండు చేస్తున్నారంటూ ఆరోపించారు.ప్రతినెల ఎక్సైజ్ అధికారులకు మామూళ్లు ఇవ్వకపోతే ఇబ్బందులకు గురి చేస్తున్నారంటూ మద్యం వ్యాపారాలు వాపోయారు.తరచూ తమపై ఎక్స్ సైజ్ బెదిరింపులకు పాల్పడుతున్నారని కార్యాలయం అందోళన చేపట్టారు. షాపుల వద్ద మద్యాన్ని కొనుగోలు చేసే వారిని సైతం అరెస్టులు చేసి షాపులపై కేసులు కడుతున్నారని, ఇలాగైతే షాపులు మేము నడపలేమని ఎక్సైజ్ సిఐకు తాళాలు అప్పగించి షాప్ యజమానులు తమ నిరసన తెలిపారు.

# అర్జీలకు నిర్ణిత గడువులోపు పరిష్కారం చూపాలి



కాకినాడ, మేజర్ న్యూస్ : ప్రజా పిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం ద్వారా వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ ప్రజల నుంచి అందిన అర్జీలకు నిర్ణిత గడువులోపు పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కాకినాడ కలెక్టర్ కార్యాలయం వివేకానంద హాలులో నిర్వహించిన జిల్లా స్థాయి ప్రజా పిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పిజిఆర్ఎస్) కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ షణ్మోహన్..జేసీ రాహుల్ మీనా, జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు, ట్రైనీ కలెక్టర్ జె.మనిషా, సీపీవో పీ.త్రినాథ్, బీసీ కార్పొరేషన్ ఈడి ఎ.శ్రీనివాసరావు, ఎస్ఎస్ఏ పీవో వేణుగోపాల, ఎస్డీసీ జీజీహెచ్ ఎన్.శ్రీధర్ లతో కలిసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. అర్జీదారుల సమస్యలను ఆయన ఆలకించి, వారీ అర్జీలపై సత్వర పరిష్కారం అందించాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ప్రధానంగా రేషన్ కార్డులు, పింఛన్లు, ఇళ్ల స్థలాలు, ఆక్రమణల తొలగింపు, ఉపాధి కల్పన, తల్లికి వందనం, భూములు ఆన్ లైన్ లైన్, సదరమ్ సర్టిఫికేట్ల జారీ తదితర వ్యక్తిగత సమస్యలతో పాటు, ఆయా ఆవాసాల్లో ఎదుర్కొంటున్న సామాజిక సమస్యలపై ప్రజల నుంచి 580 అర్జీలు అందగా వాటన్నిటినీ ఆర్ఎస్ పోర్టల్‌లో ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసి, అర్జీదారులకు రశీదులు అందజేసారు. సందర్భంగా జిల్లా కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ ప్రజల నుంచి అందిన ప్రతి అర్జీని నిర్దిష్ట కాలపరిమితి లోపు పరిష్కారాలను అందించాలన్నారు. ఒకే అంశంపై మళ్లీ మళ్లీ దరఖాస్తు నమోదు అయ్యే అంశాలపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. పరిష్కరించిన అర్జీల వివరాలను ఆన్ లైన్ నమోదు చేయాలన్నారు. వివిధ శాఖల అంశాలపై నమోదైన అర్జీల పరిష్కారం పట్ల ఆయా శాఖల జిల్లా స్థాయి అధికారులు ప్రత్యేక పర్యవేక్షణ చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారులు, కలెక్టర్ కార్యాలయ సెక్షన్ సూపరిండెంట్లు తదితరులు పాల్గొన్నారు.

## నెట్‌వర్క్ పనిచేయని స్మార్ట్‌ఫోన్లు మాకొద్దు

**– సిడిపిఓ కార్యాలయంలో తిరిగి ఇచ్చేసిన అంగన్వాడి ఫోన్లు**
**– ముఖచిత్రం యాప్ రద్దు చేయాలి**



**కాకినాడ రూరల్, మేజర్ న్యూస్ :** ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా కాకినాడ రూరల్ ప్రాజెక్టు పరిధిలో ఉన్న తొమ్మిది సెక్టార్ల అంగన్వాడిలు నెట్వర్క్ లేని స్మార్ట్ ఫోన్లు సిడిపిఓ కార్యాలయంలో తిరిగి ఇచ్చేయడం జరిగింది. ఈ సందర్భంగా కాకినాడ రూరల్ ప్రాజెక్ట్ అధ్యక్ష, కార్యదర్శులు పి.వీరవేణి, ఎ.వీరమణి మాట్లాడుతూ నెట్వర్క్ పనిచేయని ఫోన్‌లతో 11 యాపుల భారంతో పనిచేయలేక ఫోన్లు తిరిగి సిడిపిఓ కార్యాలయంలో అందజేయడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నాలుగు సంవత్సరాల క్రితం ఇచ్చిన స్మార్ట్‌ఫోన్‌లో నెట్‌వర్క్, నెట్ ఇతర సౌకర్యాలు లేక రిపోర్టులు సక్రమంగా అందించక అధికారులు వేధింపులు ఎక్కువవుతున్నాయి అన్నారు. అంగన్వాడి సెంటర్లో రికార్డులో రాసి లబ్ధిదారులకు పోస్టుకాహారం అందజేస్తామ న్నారు. సిఐటియు కాకినాడ రూరల్ మండల కార్యదర్శి టి.రాజా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు యాప్ లు భారం తగ్గిస్తామని హామీ ఇచ్చి నేడు అధికారంలోకి వచ్చిన తర్వాత మాట మార్చిందని విమర్శించారు. చంద్రబాబు పాలన విజన్ ఉంటుంది కానీ అంగన్వాడీ టీచర్లకు ఇచ్చే ఫోన్లో నెట్వర్క్ ఉండటం లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ లీడర్లు సత్యవేణి, రాజేశ్వరి, లక్ష్మి, తనుజ, వరలక్ష్మి, భవాని, అచ్చిరత్నం, నాగజ్యోతి, సురేఖ, చామంతి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రారంభమైన వాడపల్లి వెంకన్న పవిత్రోత్సవాలు

**– పోటెత్తిన భక్తజనం**



**ఆత్రేయపురం, మేజర్‌న్యూస్ :** కోనసీమ తిరుమల వాడపల్లి వెంకటేశ్వరస్వామి వారి ఆలయంలో సోమవారం శ్రీవారి పవిత్రోత్సవాలు వైభవంగా ప్రారంభమ య్యాయి. ఏడాది పొడువున జరిగే నిత్య కైంకర్యాలలో భక్తులు అర్చకులు వల్ల తెలిసి తెలియక జరిగే దోషాలు నివారణార్థం ప్రాయశ్చిత్త క్రతువు పండితులు ఖండవల్లి రాజేశ్వర వరప్రసాదాచార్యుల ఆధ్వర్యంలో ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనము, దీక్షాధారణ, ఋత్విక్ వరుణ, ఆకల్మష హెూమము ,నీరాజన మంత్రపుష్పములు, తీర్థ ప్రసాద వితరణ, సాయంత్రం విశ్వక్సేన పూజ పుణ్యాహవచనము, మృత సంగ్రహణ అంకురార్పణ, నవమూర్తి ఆవాహన, పంచగవ్య ప్రోక్షణ, పంచ శయ్యాధివాసం, నీరాజన మంత్రపుష్ప ములు, తీర్థ ప్రసాదవితరణ తదితర కార్యక్రమాలు అంత్యంత వైభవంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని కార్యక్రమాలను తిలకించి పులకించారు. ఏర్పాట్లను ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధర్ రావు పర్యవేక్షించారు.

## పద్మశ్రీ గరికిపాటిని కలిసిన గేదెల శ్రీనివాస్



**సామర్లకోట, మేజర్ న్యూస్ :** మహా ప్రవచనకర్త కార్యమిక ఉపన్యశకులు పద్మ శ్రీ అవార్డు గ్రహీత గరికపాటి నరసింహ రావుని జిల్లా యువజన సంఘాల కార్యదర్శి గేదెల శ్రీనివాస్ రావు సోమవారం కలిశారు ఈ సందర్భంగా జిల్లా యువజన సంఘాల కార్యదర్శి గేదెల శ్రీనివాసరావు మాట్లాడుతూ గరికపాటి నరసింహారావు గారి ప్రవచనాలు ఎంతగానో ఆదరిస్తున్నారని అన్నారు ఆయన చెప్పిన సూక్తులు ప్రవచనాలు ఎంతగానో ప్రజలను వారి దయ నందిని జీవితాల్లో ఉపయోగించుకుని నడుచుకుంటున్నారని అన్నారు వారి ప్రవచనాలు ప్రతి ఒక్కరికి ఎంతగానో ప్రయోజనకరంగా ఉన్నాయని అన్నారు ఈ సందర్భంగా గరికపాటి నరసింహారావు కు యువజనుల సత్ప్రవర్తనకు మంచి ప్రవచనాలు అందించాలని గేదెల శ్రీనివాసరావు కోరారు.